

కథా కౌముది

# గురివిందనాయుడు

– డా. మూలా రవికుమార్

"జైజైరా బండి నాయుడన్నా, నీపేరు విన్న దొంగోళ్ళకు నిద్దుర రాదన్నా."

బస్సు దిగి ఊళ్ళోకి వస్తుంటే పాట వినిపించింది

"ఇదేమిటీ? ఈపాటా ఎప్పుడూ వినలేదే."

"ఈపాట ఈ ఊరి బయట ఎప్పుడూ వినబడదు. ఈ ఊళ్ళో కూడా సంవత్సరానికి ఒకసారే వినబడేది."

ప్రశ్న అడిగిన రాజేషుది జంషెడ్ పూర్. నా వయసువాడే, నెలలేతేడా. వాళ్ళ నాన్నగారు మాతాతగారి అన్నకొడుకు, అంటే మా పెదనాన్నగారు అన్నమాట. నలభై ఏళ్ళకిందట మా ఊరినుంచి జంషెడ్పూర్ వెళ్ళి అక్కడే రైల్వే ఉద్యోగంలో స్థిరపడి, సొంతిల్లు కట్టుకొని ఎనిమిదేళ్ళకిందట రిటైరయ్యారు. రాజేష్ ఈ ఊరు రావటం వాడి ముప్పై ఏళ్ళ వయసుకి ఇది మూడోసారి.

జవాబు చెప్పిన నేనేమో పుట్టిన పదిహేనేళ్ళవరకూ ఎప్పుడూ మా ఊరి బయట పదిరోజులుండనివాణ్ణే అయినా, పదహారో ఏట నుండీ అవిచ్ఛిన్నంగా నెల రోజులు మా ఊళ్ళో ఉండలేదు. గత ఐదేళ్ళలో ఇక్కడికి రావటం ఇదే నేనూ రాజేషూ వైజాగ్‌లో ఓ పెళ్ళిలో కలిసేం, అనుకోకుండా ఇద్దరికీ ఒకరోజు ఖాళీ దొరికడంతో మా ఊరు బయలుదేరాం. బస్సు దిగ్గానే మామధ్య సంభాషణే, పైప్రశ్నా, జవాబూ.

ఇప్పుడు మేమొచ్చింది ఎవరింటికీ కాదు. ఓ రెండు గంటలు మా ఊళ్ళో తిరిగి, నన్నుపోల్చుకొగలిగిన వాళ్ళతో కొంచెంసేపు మాట్లాడి, మళ్ళీ వైజాగ్ వెళ్ళిపోవడమే మా ఎజెండా. మా ఊరైన చింతలవలస వెళ్ళాలంటే, ప్రస్తుతం మేము బస్సు దిగిన ఊరు, పెద్దవలస, నుండి ఒకటిన్నర కిలోమీటరు దూరం పొలాల్లోంచీ నడుచుకుంటూ వెళ్ళాలి.

"ఇంతకీ బండినాయుడంటే ఎవరూ, ఈపాట సంవత్సరానికొక్కసారే ఎందుకు వినబడుతుంది?"

నేనేమీ మాట్లాడకుండా, వాణ్ణి బస్టాపునుంచి వంద మీటర్ల దూరంలో ఉన్న, ఆ పాట వస్తున్న చోటికి తీసుకుపోయాను. అక్కడ సిమెంటుతో పెద్ద రచ్చబండ మాదిరిగా పదిహేనడుగుల చదరం కట్టబడి ఉంది. మధ్యలో ఒక కాగు (కానుగ) చెట్టు, రోజులో ఏ టైంలోనైనా దాని నీడ రచ్చబండ మొత్తనికి సరిపోయేటట్లు ఉంది. ప్రస్తుతం బండి నాయుణ్ణి కీర్తిస్తూ మైక్‌లో పాడుతున్న మనిషి కూర్చొన్నది, ఈబండమీదే చదరం నీడ పడనంత దూరంలో ఒక సమాధి, అందులో ఒక తులసి మొక్క ఉన్నాయి.

మావాణ్ణి అక్కడికి తీసుకెళ్ళి సమాధి మీద ఉన్న అక్షరాలు చదవమన్నాను.

టూ ఫైవ్ నైంటీన్ ట్వంటీ ఫైవ్ ఎండ్ టెన్ త్రీ సెవెంటీ ఫోర్ అని డేట్లు మాత్రం చదివి ఊరుకున్నాడు.

అప్పుడు గు ర్తొచ్చింది, మావాడు తెలుగు లిపి నేర్చుకోలేదని.

"నువ్వు చదివినవి రెండూ బండి బంగార్నాయుడి జనన మరణ తేదీలు. అంటే డేటాఫ్........"

"ఒరేయ్, నాకు తెలుగు చదవటం రాయటమే రాదు, నువ్వు ప్రతీదాన్నీ ఇంగ్లీషులో చెప్పడం మాని నేనడిగినవి చెప్పు చాలు."

"ఈరోజు బండి బంగార్నాయుడు చచ్చిపోయినరోజు. అందుకే ఈ సమాధి మీద పువ్వులూ అగరొత్తులూ ఉన్నాయి, ఇలాంటి సమాధినే ఇక్కడ గుండం అంటారు. కాగు చెట్టు నీడన దండ వేసి వున్న ఫోటో బంగార్నాయుడిదే ప్రతి ఏటా ఇదేరోజు ఇక్కడ ఇలాంటిదే జరుగుతుంది. దీన్ని ఇక్కడ తీర్థం అంటారు. పగలు ఈ హడావుడీ, సాయంత్రం నుంచీ చిన్నచిన్న దుకాణాలు పెట్టుకొని, బొమ్మలూ, స్వీట్స్ అమ్ముకుంటారు. రాత్రి పది తర్వాత బుర్రకథో, నాటకమో ఉండేది, మా చిన్నప్పుడు. ఈమధ్య రికార్డింగ్ డాన్సులూ, ఆర్కెస్ట్రాలూ మొదలయ్యాయనుకో."

"ఇంతకీ, బండి నాయుడెవరో చెప్పేవు కాదు."

చాలా సేపటినుంచీ మమ్మల్ని దూరంనుంచీ గమనిస్తున్న యాభై ఏళ్ళ మనిషి మాదగ్గరికి రావటం, నన్నుపోల్చుకొని రాజేష్ ప్రశ్న విని, వెంటనే మొదలెట్టేడు.

"బండి బంగార్నాయుడంటే ఆయన బతికున్న రోజుల్లో ఈ సుట్టుపక్కల ముప్పై ఊళ్ళ జనాలందరికీ అడలే (హడలే). సమితి పెసిరెంటు (ప్రెసిడెంట్)గా సేసేడు. సాలూరు తాలుకాలో ఇంత పెద్దమణిసి నేడు. ఉప్పుడు (ఇప్పుడు) బతికుంటే ఈపాటికి ముఖ్యమంత్రి అయ్యేవోడు." అనిచెప్పి మళ్ళీ వెళ్ళి కాగు చెట్టు నీడన కూర్చొన్నాడు.

మేమిద్దరం ఓ ఫర్లాంగు దూరం మాఊరు వెళ్ళే దారిలో నడిచేకా రాజేషడిగేడు. "నాయుడి గురించి అతను చెప్పింది నిజమేనా?".

"నేను పుట్టటానికి ఎనిమిదేళ్ళ ముందు చచ్చిపోయిన మనిషిగురించి నేను ఏవిషయమూ ఖచ్చితంగా చెప్పలేను. కానీ మన పెద్దవాళ్ళ ద్వారా నేను తెలుసుకున్న విషయాలు చెప్పగలను. ఇందులో, కొన్ని విషయాలు తప్పుకావచ్చు, ఓవరెస్టిమేట్ లేదా అండెరెస్టిమేట్ కూడా కావచ్చు." అని మొదలెట్టేను.

బండి బంగారు నాయుడు ఐదోక్లాసు చదువుకున్నాడు. వ్యవసాయం చేసుకుంటూనే రాజకీయాల్లోకొచ్చి, పంతొమ్మిది వందల అరవై నాటికి ఈ ఊరి ప్రెసిడెంటు అయ్యేడు. అప్పట్లో పంచాయితీ సమితి అని ఓ పదిహేను పంచాయితీలు కలిపి ఉండేది. ఇలాంటి నాలుగైదు సమితులు కలిస్తే ఒక తాలుకా అయ్యేది. చురుగ్గా ఉంటూ తాలూకాలో అందరికీ - ఎమ్మెల్యే ఎంపీలక్కూడా - తెలిసిన సర్పంచ్ అయేడు. ఆ విధంగా మరో ఐదేళ్ళు గడిచేకా సమితి ప్రెసిడెంటు అయ్యేడు.

సమితి ప్రెసిడెంటు అయ్యేకా తనేంటో జనాలకి చూపించేడు. అన్నదమ్ముల ఆస్తిపంపకాలూ, ఇంటితగువులూ అన్నీ తీర్చేవాడు. ఏకులస్తులైనా కులమ్మీరి ప్రవర్తిస్తే దండించేవాడు. కులమ్మీరి లేచిపోయిన జంటల్ని వెతికి తీసుకొచ్చి, అబ్బాయిని తన్నించి, అమ్మాయిని తల్లిదండ్రులకప్పజెప్పేవాడు. ఆస్తిపంపకాల్లో వర్ణసంకరులకీ, వివాహేతర సంతానానికీ వాటా లేకుండా తీర్పిచ్చేవాడు. అందరూ బంగార్నాయుడి న్యాయమే న్యాయం అనుకునేవారు.

అలాంటినాయుడి దృష్టిలో చింతలవలసలో ఉన్న గోరేవడి పడింది. అది ఎప్పటినుంచో, గజపతి మహారాజుగారిపాలన నుంచీ, ఊళ్ళోవాళ్ళందరూ ఆవులు మేపుకుందికని సాగు చెయ్యకుండా వదిలేసిన పదిహేనెకరాల పల్లపుభూమి. అంతే, తన అనుచరగణంతో వెళ్ళి దాన్ని దున్నించేసాడు. నాయుడి బలం, పరపతి తెలిసిన చింతలవలస వాళ్ళు, వాళ్ళఊరి పంతులుగార్లలో పెద్దవారైన సుబ్బన్న బుగత గారిని సలహా అడిగేరు. ఆయన వయసు అప్పటికే ఎనభై ఏళ్ళు. బండినాయుడు నాముందు చిన్న గుంటవెధవరా, అని చెప్పి, మర్నాడు తనే

స్వయంగా వెళ్ళి గోరేవడి గట్టుమీద కూర్చొని, అక్కడికి వచ్చిన నాయుడి అనుచరుల్ని కసిరి, తిట్టి మీనాయుడ్నే రమ్మనండిరా, వాడితో నేను మాట్లాడాలి అన్నారు. వాళ్ళు వెళ్ళిపోయారు.

"సుబ్బన్న బుగతా? అంటే మా తాతగారా!?" రాజేషడిగాడు.

అవును, ఆయనే. ఓ గంట గడిచేకా నాయుడైతే రాలేదు గానీ నాయుడి అనుచరులు, వేరే ఊరివాళ్ళూ, బుగతగారిని ఎప్పుడూ చూడనివారూ వచ్చి బుగతగారిని కర్రలతో కొట్టటమూ, ఆయన తలకి దెబ్బ తగిలి పడిపోవటమూ జరిగింది. రాత్రే ఎద్దులబండిలో బుగతగారిని విజయనగరం తీసుకెళ్ళి హాస్పిటల్లో చేర్పించేరు.

"మైగాడ్ నేను పుట్టకముందూ, తాతగారికి తలకి దెబ్బ తగిలిందని తెలుసు గానీ ఇలా అని తెలీదు. తర్వాత?" రాజేష్ కొంచెం ఎమోషనల్‌గా అడిగాడు.

హాస్పిటల్నించి తిరిగొచ్చేకా చింతలవలసవాళ్ళకి తెగింపు వచ్చేసింది. 'మనూరి పంతులుగోరిని, ముసిలి బుగతగోరిని నంజికొడుకులు కొడితే, మనెదవనంజికొడుకులకి సిగ్గూ నజ్జా ఉండాలా' అని వాళ్ళని వాళ్ళే తిట్టుకొని, రాత్రంతా చింతలవలస ఊరిమగాళ్ళంతా వెళ్ళి రేవటిమీదే పడుకున్నారు. విషయం తెలిసిన నాయుడు, తనా సమితి పరిధిలో ఇరవై ఊళ్ళనుంచి ఓ మూడువందల మందిని తెప్పించి రేవటి మీదకి పంపించేడు. గుంపు రేవటికి ఫర్లాంగు దూరంలో గోర్జిలో నడుస్తుండగా, వాళ్ళ మీద ఒక పెద్ద తాటి చెట్టు పడింది. అంతే పదిమంది అక్కడికక్కడే చచ్చిపోయారు. కనీసం యాభై మందికి, దెబ్బలు తగిలేయి. మిగిలిన వాళ్ళంతా వచ్చిన దారినే పారిపోయారు, శవాల్నీ, దెబ్బలు తగిలిన వాళ్ళనీ, వాళ్ళ అరుపుల్నీ పట్టించుకోకుండా.

"గోర్జి అంటే ఏమిటి?" రాజేష్ సందేహం.

గోర్జి అంటే పది అడుగులకన్నా తక్కువ వెడల్పు ఉండే సన్నపాటి దారి. దారికి రెండు వైపులా ఉండే గట్లమీద దట్టంగా పొదలూ, చెట్లూ ఉంటాయి. వానాకాలంలో పొలాల్లో ఎక్కువైన నీరు ఇందులోంచీ ప్రవహించి, వేరే చెరువులో కలుస్తుంది. మిగిలిన కాలాల్లో ఇది ఎద్దులబళ్ళకి దారిగా ఉపయోగపడుతుంది.

"తాటిచెట్టు ఎలా పడింది?" చాలా ఆసక్తిగా అడిగాడు.

చింతలవలసవాళ్ళు రాత్రంతా ఒక తాటిచెట్టు చివరన పెద్ద పెద్ద తాళ్ళతో మిగిలిన చెట్లకి కట్టి దాని మొదలు నరికేసారు.

చూసేవాళ్ళకి ఏమీ తెలీదు. నాయుడి మనుషులు సరిగ్గా తాటిచెట్టుపడే చోటకి రాగానే అప్పటికే పక్కచెట్ల మీద ఉన్నవాళ్ళు తాళ్ళు నరికేసారు. నాయుడి మనుషులు గోర్జిలో ఉండటం వల్ల చెల్లాచెదరవటానికి కూడా వీలులేకుండా అయిపోయింది.

"అంతపెద్ద చెట్టుకీ చచ్చింది పదిమందేనా!"

గోర్జిలో కొన్ని చెట్ల పొదలూ అడ్డదిడ్డంగా పెరగటంవల్ల, తాటి చెట్టు ముందు వాటిమీదపడి పూర్తిగా నేలను తాకకుండా, నాలుగడుగుల ఎత్తులో ఆగిపోయింది.

"అదావిషయం. లేదంటే, కేజువాల్టీస్ నెంబరూ, ఇంజూర్డ్ నెంబరూ రివర్స్ అయ్యేది. తర్వాత ఏమైంది?"

శవాల పోస్టుమార్టం, రేవటిమీద పోలీసుపహారా అయ్యాకా, నాయుడి చొరవతో చింతలవలస మొగాళ్ళు చాలామంది, ఖూనీ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలుకెళ్ళేరు. వాళ్ళందరూ జైలుకెళ్ళగానే నాయుడు చింతలవలసని ఒక చూపు చూద్దామనుకున్నాడు గానీ, అతని అనుచరులెవరూ అందుకు సాహసించలేదు. 'ఊళ్ళో మొగాళ్ళెవరూ లేర్రా', అని నాయుడెంత చెప్పినా తాటిచెట్టుపడ్డప్పుడు కలిగిన భయం వాళ్ళ మనస్సుల్లోంచి పోలేదు. ఎంక్వయిరీ తర్వాత రేవడి ఎప్పటికీ పశువుల మేతకేననీ, దాన్ని దున్నేహక్కు ఎవరికీ లేదనీ కలెక్టర్ ఆర్డర్ ఇచ్చి రెండు గ్రామాల్లో చాటింపు కూడా వేయించారు. నాయుడు రేవటిమీద ఆశ వదులుకున్నాడు. రేవటియుద్ధానికి నలభయ్యేళ్ళు పూర్తయ్యాయి.

"నాయుడిమీద లేండ్ గ్రేబింగ్ కేసు పెట్టలేదా?" రాజేష్.

"ఎవరు పెట్టాలి? నాయుడి పలుకుబడి గురించి ఒక ఉదాహరణ చెబతా విను. పెంటయ్య అనేవాడు నాయుడిమీద తోక జాడిస్తే, వాడు తన దగ్గర మూడు వందల రూపాయలు అప్పు తీసుకున్నట్టుగా ఒక ప్రామిసరీ నోటు సృష్టించి వాడి మీద కేసు పెట్టేడు. వాడు అది నా వేలిముద్ర కాదన్నాడు. ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పెర్ట్ రిపోర్ట్ కావాలన్నారుట, కోర్ట్‌లో. ఈలోపల నాయుడి కుటుంబాన్ని బెదిరిస్తున్నాడన్న కేసొకటి పెంటయ్యమీద బుక్కయ్యింది.

పోలీసులు వాణ్ణి వేదించడం మొదలుబెట్టేరు. ఎక్స్‌పెర్ట్ రిపోర్ట్ తనకే అనుకూలంగా వస్తుందన్న ధీమాతో వేధింపుల్ని భరించేవాడు. మూణ్ణెల్ల తర్వాత, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పెర్ట్ లాంగ్ లీవ్‌లో ఉన్నాడనీ, రిపోర్ట్ పంపటానికి మూణ్ణెల్లు పడుతుందన్నది దాని సారాంశం, ఆ ఫోరెన్సిక్ లేబ్‌నుండి సమాధానం వచ్చింది. ఈలోగా పెంటయ్యమీద పోలీసు వేధింపులు పెరిగాయి. చివరికి కాళ్ళబేరానికొచ్చి, నాయుడికీ, పోలీసులకీ మామూళ్ళూ సమర్పించుకొని, బయటపడ్డాడు."

"మనూరివాళ్ళు ఎన్నాళ్ళు జైల్లో ఉన్నారు?"

"నాలుగేళ్ళు. నాయుడు చచ్చిపోయినతర్వాత, ఒకమంచి లాయర్ వీళ్ళకేసు తీసుకొని దొమ్మీ కేసుకింద కొట్టించగలిగేడు. అదీకాక, చాలా మంది సాక్ష్యులకి నాయుడు పోయిన తరవాతే ధైర్యం వచ్చింది."

"మరి నాయుడెలా చచ్చిపోయేడు?"

"అందరూ బయటకి చెప్పుకొనే కారణం, హార్ట్‌ఎటాక్"

"మరి నిజం?"

"దేవుడికే తెలియాలి. కానీ చచ్చి పోయే నెలరోజులముందు నుండీ అతడికి అన్న, చోడవరపు నారాయణనాయుడితో చిన్న తగువుండేది."

"అంటే వీళ్ళిద్దరూ పినతల్లి పెత్తల్లి పిల్లలా?"

"కాదు ఒకే తల్లి పిల్లలు."

"అదెలా!! ఇద్దరి ఇంటిపేర్లూ వేరేవేరే కదా?"

"చోడారపు నారన్నాయుడి తల్లి, కొన్నాళ్ళు భర్తతో కాపరం చేసాకా, అతణ్ణివదిలి వచ్చేసి బంగార్నాయుడి తండ్రితో కాపరం చేసింది. ఆ సంతానమే బంగార్నాయుడు."

"ఇంతకీ తగువేంటీ?"

"యాభై రూపాయలనుకుంటా, నారన్నాయుడు, బంగర్నాయుడికి బాకీ. అందర్నీ బెదిరించినట్టే అన్నని కూడా తొందరగా తీర్చకపోతే నీ ఎద్దులు జప్తు చేసుకుంటా అని బెదిరించాడట. ఓరోజు ఉదయాన్నే పనిచేసేందుకు బయలుదేరాడు. ఎద్దులపాకలోకెళ్ళిన పది నిమిషాల్లో పరిగెత్తుకుంటూ ఇంటికొచ్చి గుండెనొప్పి అంటూ మంచం మీద పడ్డాడు, మరి లేవలేదు. జనాలు చెప్పుకోవటమేమిటంటే, ఎద్దును విప్పుతున్న నాయుణ్ణి, నారన్నాయుడూ, అతడి పదిహేనేళ్ళ కొడుకూ కలసి వెన్నుమీద నాగలిపూజతో కొట్టేరని."

"పూజ అంటే ఏంటీ?"

"ఎద్దుల్ని నాగలికి కట్టటానికి వాడే లావుపాటి పెద్ద కర్ర. దీన్నే అచ్చతెలుగులో కాడి అనీ ఇంగ్లీషులో యోక్ అంటారు."

"రోకలి చూసేను, అంత ఉంటుందా?"

"పొడవు అంతే ఉంటుంది, కానీ లావూ, బరువూ, రోకలికి మూడింతలుంటుంది."

"అమ్మో, దాంతో కొట్టేరా. తర్వాత కేసు అవలేదా?"

"కేసయితే హార్ట్ ఎటాక్ ఊసెక్కడొస్తుంది? చచ్చిపోయిన వాడికీ, చంపినవాళ్ళకీ ఒకే మనుషులు చుట్టాలు గనక, అన్ని ఊళ్ళకీ గుండెపోటు వల్ల నాయుడు చచ్చిపోయినట్టు కబురు పెట్టి అదే రోజు శవాన్ని దహనం చేసేసారు. కులాచారం ప్రకారం శవాన్ని కాల్చకూడదు, పాతిపెట్టాలి!"

"చుట్టాలంతా ఊరుకోబెట్టినా పిల్లలూరుకున్నారా?"

"పిల్లలకన్నా ముందు నాయుడి భార్యలగురించి చెప్పాలి. అతడికి పెద్దవాళ్ళు చేసిన పెళ్ళి పోలమ్మ అనే ఆవిడతో. ప్రస్తుతం ఈ ఊళ్ళో ఉండేది కూడా పోలమ్మే. నాయుడు పెద్దవాడయ్యాకా, నాగమ్మ అని పిలువబడే నాగమణి అనే ఒకావిడ తన భర్తనీ పిల్లల్నీ వదిలి నాయుడి దగ్గరకొచ్చేసింది, ఆవిడది వేరే కులం. నాయుడితో పదేళ్ళ కాపరం, నలుగురు పిల్లలూ అయేకా, ఆవిడ చనిపోయింది, నాయుడు బతికుండగానే. ఎలుకలమందు తాగి ఆత్మహత్య చేసుకుందన్న విషయం, నిజమో అబద్ధమో తెలీదు కానీ, దాదాపుగా ఎవరూ అనుకోరు."

"ఇలాంటిపని వేరెవరైనా చేస్తే నాయుడు దగ్గరుండి వాణ్ణి తన్నించేవాడేమో, వేరేవాడి భార్యని ఎలాతీసుకొచ్చేడు.?"

"నాయుడికి న్యాయం చెప్పేవాడుండాలికదా!"

"నాయుడి పిల్లలు?"

"పోలమ్మ సంతానం ఇద్దరూ ఆడపిల్లలే. నాయుడు చనిపోకముందే వాళ్ళ పెళ్ళిళ్ళయిపోయాయి. అల్లుళ్ళిద్దరికీ టీచరుద్యోగాలే. వాళ్ళెవరికీ పెద్దవలసలో ఉండి ఈ తగువులూ బాధలూ పడే ఓపిక లేదు. నాగమ్మ అప్పటికే చచ్చిపోయింది. కొడుకులు అప్పటికి కేసుపెట్టే వయసున్నవాళ్ళుకాదు. అంచేత అప్పటికలా జరిగిపోయింది."

"ఎలాంటివారినైతే నాయుడు ఇల్లీగల్లీ బోర్న్ అని వాళ్ళకి ప్రోపర్టీ రైట్స్ లేకుండా తీర్పిచ్చేవాడో, అలాంటికొడుకులే ఉన్నారా, నాయుడికి? అన్నట్టు, నాయుడు కూడా అలాంటి సంతానమే! ఇదెలా సాధ్యం?"

"బుష్ హయాంలో, వైట్ హౌస్ ఆధిపత్యాన్ని ప్రపంచం మీద, ముఖ్యంగా నల్లజాతులమీద రుద్దే అమెరికా ప్రతినిధి కండోలీజా రైస్, నల్లజాతిమనిషే. దేశవిభజనలో ఇండియానుంచి పాక్ వలస వెళ్ళిన మొహాజీర్లలో ముషారఫ్ స్వయంగా ఉన్నా, మొహాజీర్లని ముషారఫ్ అసహ్యించుకుంటాడుట?"

"నిజమే! అలాంటిమనుషులు విదంగా బిహేవ్ చెయ్యటానికి కారణం ఏమిటంటావ్.?"

"నా నమ్మకం ఏమిటంటే, సమాజం దృష్టిలో ఇలాంటి మైనస్ పాయింట్స్ ఉన్నవాళ్ళు స్వయం కృషితోనో, మరోవిధంగానో, పెద్దమనుషులవగానే, వాళ్ళ అనర్హతల గురుంచి ఎవరైనా మాట్లాడుకుంటారేమోనని అభద్రతా భావం ఉంటుంది. అంచేత, అవే మైనస్ పాయింట్లున్న సామాన్యుల్ని శత్రువుల్లా చూడటం ద్వారా, సమాజంలో తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలనుకుంటారు. నా నమ్మకం అందరి విషయంలోనూ నిజం కాకపోవచ్చులే."

"ఇప్పుడు నాయుడి కొడుకులేంచేస్తున్నారు?"

"అందరికన్నా పెద్దవాడు, వాళ్ళ నాన్న చచ్చిపోగానే పిచ్చెత్తిపోయి తర్వాత చచ్చిపోయాడు. తర్వాత ఇద్దరూ పోలీసు కానిస్టేబుల్స్‌గా సెటిల్ అయ్యారు, ఇక్కడికి నలభై కిలోమీటర్లు దాటి. ఆఖరివాడు, ఈ ఊళ్ళోనే ఉంటూ, ఒక్కో ఎలక్షనుకీ ఒక్కో పార్టీ నాయకుడి వెనకాల తిరుగుతూ, పొలాలు చూసుకుంటాడు."

"అలాంటి మనిషికా ఇన్నాళ్ళూ ఇంత ఘనంగా డెత్ ఏనివర్సరీలు చేస్తున్నారు!!?" రాజేష్ ఆశ్చర్యం.

"వీళ్ళు చాలా నయం. నాయుడి తీర్థం అంతా తమ కుటుంబ ఖర్చుతోటే జరిపిస్తున్నారు. స్టేట్ లెవెల్ లీడర్లనో, నేషనల్ లెవెల్ లీడర్లనో చూడు, బతికున్నప్పుడు ఎంత వెధవలైనా, చచ్చేకా వాళ్ళ ఖర్చులన్నీ గవర్నమెంటు డబ్బే కదా. ఆ లెఖ్ఖన, బండినాయుడి పేరుమీద, ఈ ఊళ్ళో ఒక చెరువో, స్కూలో ఉండాలి. నాయుడు చచ్చిపోయేసరికి కొడుకులు పెద్దవాళ్ళై, ఏవైనా పదవుల్లో ఉండి ఉంటే అదీ జరిగేదేమో!!"

"నిజమేను రోయ్. అన్నట్టు, మన ఊరొచ్చింది, నాకెవరూ ఇక్కడ తెలీదు, యాభై ఏళ్ళలోపువాళ్ళకైతే, మానాన్నగారిపేరు చెప్పినా కూడా తెలీదు, ఓ అరగంట ఇక్కడ కనబడినవాళ్ళలో నీకు తెలిసినవాళ్ళతో మాట్లాడి. మళ్ళీ వైజాగెళ్ళిపోవాలి." అన్నాడు రాజేష్.

ఇద్దరం ఊళ్ళోకి నడిచేం.

Click here to share your comments on this story